
# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం
ఏలూరు

మే 2025



ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవ పీఠం వారి అంతర్జాల ఆధ్యాత్మిక మాస పత్రిక
ఏలూరు

మే , 2025
సంపుటి-4
సంచిక-5

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 01 | సంపాదకీయం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 04 | శ్రీ గణేశ పురాణం | శ్రీమతి పాలగుమ్మి శ్రీవిద్య |
| 05 | శ్రీ వేంకటేశ్వర రహస్యం | శ్రీమతి నిడుముక్కల శ్రీకరి |
| 06 | పురాణంలో మహిళలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 07 | ఐశ్వర్యయోగం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 08 | ఋషిచరిత్ర | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 09 | కాశీ కథలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 10 | స్తోత్రమాలిక | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 12 | గురుదేవుల జీవన కవనము | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |


శ్రీ మహాగణాధిపతయే నమః శ్రీ గురుభ్యోనమః శ్రీ మాత్రే నమః

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు, శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు.

**https://srivaddipartipadmakar.org**

© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.




యజ్ఞముల ద్వారా, అగ్నికార్యముల ద్వారా పరమాత్మతో మనలను అనుసంధానం చేస్తాడు పంచభూతదివ్యస్వరూపుడు అగ్నిభగవానుడు.ఆ అగ్నిభగవానుని ద్వారా వశిష్ఠునికి చెప్పబడి వేదవ్యాసునిచే లోకానికి అందించబడినది ఈ అగ్నిపురాణం. సంక్షిప్తంగా నవాహ (౯ రోజుల) పారాయణమునకు వీలుగా అభినవశుక, ప్రవచననిధి పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు, వారి దివ్యాశీస్సులతో తమ శిష్యులచే సంకలం చేయించిన ఈ గ్రంథాన్ని భక్తిశ్రద్ధలతో పారాయణ చేసినవారికి సమస్త వాస్తుదోషాలు, శత్రుపీడలు తొలగి, భయంకర కష్టాల్లోంచి బయటపడతారు. పుష్కరంలో స్నానం చేసి నూరు కపిలగోవులను దానం చేసిన మహాఫలితం పొందుతారు.

పూజ్య గురుదేవులు అందించిన పుస్తకముల కొఱకు:


https://shop.srivaddipartipadmakar.org

శ్రీ ప్రణవపీఠం
सत्यं वद - धर्मं चर
ఏలూరు

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# సంపాదకీయం

## దేశభక్తి – హిందూశక్తి



హిందువులపై దినదినం ఆధునిక రాక్షసులు దాడి చేస్తూనే ఉన్నారు. మన దేశం – పొరుగుదేశం అనే తేడాలేకుండా ఉంది. ఈ స్థితిలో హిందువులు తమ కర్తవ్యంగా భావించి చిన్నప్పటి నుండి మన సనాతన ధర్మం కోసం ప్రాణం ఇచ్చే శక్తులుగా పిల్లలను తయారు చేయండి. స్వార్థంతో పాటు పరమార్థం కూడా పిల్లలకు నేర్పకపోతే ఇక కొంత కాలానికి మన భవిష్యత్తరాలు ఉండవు. లౌకికవాదం (secular) నేర్పకండి. రాముడు, కృష్ణుడు, భీముడు, అర్జునుడు వంటివారు తయారు కావాలి. కాశ్మీరు దుర్ఘటన నుండి గుణపాఠం నేర్చుకోకపోతే ఇక పాఠం నేర్చుకొనే అవకాశమే లేదు. ఈ దేశంలో ఉన్న పాకిస్థాన్ అనుకూల నీచులను తరిమి దేశభక్తిని చాటుకోవాలసిన అవసరం ఏర్పడింది. పూజ్యుడు నరేంద్రమోదికి అందరూ అన్ని విధాలా అండగా ఉండండి.ఈ సంవత్సరం సరస్వతీ నదీ పుష్కరాలు జరుగుతున్నాయి. స్నానదానాదులతో జీవితం చరితార్థం చేసుకోండి. వైశాఖ కృష్ణ పక్ష దశమీ తిథి హనుమంతుని జన్మతిథి. ఆంజనేయుని ఆరాధన వల్ల ఆత్మబలం, బుద్ధి, యశస్సు, ధైర్యం, నిర్భయత్వం, ఆరోగ్యం వంటివి లభిస్తాయి. సత్సంగ సభ్యులు అంతటా హనుమత్పూజలు, చాలీసా పారాయణలు చేయండి. ఇది దేశ రక్షణకు చాలా అవసరం.వేసవిలో చలివేంద్రాలు ప్రణవపీఠం నిర్వహిస్తుంది. గురుభక్తి కలవారు, గుడి – బడి సంఘంలో సభ్యులయి ఇప్పటికే చలివేంద్రాలు అద్భుతంగా నిర్వహిస్తున్నారు. గుడులను శుభ్రపరచి తరిస్తున్నారు. ఇటువంటి కార్యక్రమాలను అందరూ ప్రోత్సహించాలి. జలదానం హి కర్తవ్యం, సర్వేషాం జీవనం మహత్ – అని వేంకటేశ్వర చరిత్రలో, స్కాందపురాణములో వ్యాసుడు బోధించాడు. జలదానం అమోఘదానం.సనాతన ధర్మం నిలబడాలంటే హైందవ ధర్మంలో జన్మించిన వారు ఐకమత్యంతో నడవాలి. శైవవైష్ణవాది భేదాలు, ద్వేషాలు రెచ్చగొట్టేవారి ఉచ్చులలో పడకండి. ఇప్పటికే రాక్షసమతాలు – క్రూరమతాలు మన ధర్మాన్ని నాశనం చేస్తున్నాయి. ఇప్పుడు హిందువులు, కులద్వేషం ఆచారద్వేషాలు విడచి, మన ధర్మాలను వ్యాప్తి చేసే వారికి అండగా ఉండి, ధర్మ సంరక్షణం చేయాలని మంగళాశాసనాలు చేస్తున్నాను. రాబోయే పవిత్ర యాత్రలలో పాల్గొని తరించండి.

వద్దిపర్తి పద్మాకర్



శ్రీ ప్రణవపీఠం వారి
విద్యా నిధి
ఏలూరు



# పిబరే రామ రసం

తింటూ రామయను, తినకున్న రామయను తినిపిస్తూ రామయను తింటూ రామయను, తినకున్న రామయను తినిపిస్తూ రామయను రాం రాం రాం నీవు తినిపిస్తూ రామయను రాం రాం రాం రామ రామ రామ రామ రామ రామ రామ రామ రామ రామ రామ రామ రామ రామ రామ రాం రాం రాం శ్రీ రామ రామ రామ రామ రామ రామ రామ రామ రామ



పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి అనుగ్రహంతో విద్యానిధి కార్యక్రమమును శిష్యులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం లో భాగంగా కథామృ తం పేరుతో శ్రీమతి మైసూర్ రాణి గారు పిల్లలకు కథలను చెప్పున్నారు. ఈ కథామృ తం ద్వారా అనేక మంది చిన్నారులకు నీతి కథలు, భక్తి కథలు, మహోత్ముల కథలు అనేకం పిల్లలకు తెలియజేసారు శ్రీమతి మైసూర్ రాణి గారు.కథలు చెప్పడంతో పాటు పిల్లలకు రామామృ త రుచిని కూడా పరిచయం చేసారు. ప్రతి తరగతిలో పిల్లలతో రామ నామమును రాయించారు.పిల్లలు రామ నామమును భక్తితో చదవటం, రాయటం చేసేవారు.చిన్నారులు శ్రావణి, మోక్షిత రామ నామమును నిత్యం పలుకుతూ,పలికిస్తూ,రాస్తూ, రాయిస్తూ ఉండేవారు.చిన్నారుల భక్తి శ్రద్ధలకు పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు అనుగ్రహా, ఆశీస్సులు అందించారు,అనేక మంగళా శాసనములు అందించి దీవించారు



శ్రీ ప్రణవపీఠం వారి
గుడి-బడి
ఏలూరు

# గుడి-బడి బృందం వారు గుంటూరు

పూజ్య గురుదేవుల అనుగ్రహంతో గుంటూరు, గుడి-బడి బృందం వారు గుంటూరులో మూడు చలివేంద్రాలు ఏర్పాటు చేసారు. ప్రతిరోజు శుచి, శుభ్రను పాటిస్తూ జల ప్రసాదమును దాహార్థులకు అందిస్తున్నారు.అక్షయ తృతీయ రోజు నూతన చలివేంద్ర కేంద్రమును గుంటూరు నగరానికే ఆదాయ వనరు అయిన మిర్చి యార్డు కమిషన్, వ్యాపార కూడలి ప్రదేశమైన పట్నం బజార్లో ఏర్పాటు చేసారు.







# శ్రీ గణేశ పురాణం



ఇంత జరిగినా గణపతి ఏమాత్రం కోపగించక శాంతంగానే ఉన్నాడు. జరిగింది తెలుసుకొన్న దుర్గకు భార్గవరామునిపై కోపం కలిగింది. గణపతిని దగ్గఱకు తీసుకొని ఆశీర్వదించింది. శివునితో ఇలా అన్నది — శివా! కైలాసవాసులు రాగద్వేషాతీతులు. కైలాసంలో ఉన్న ప్రతిజీవి శివస్వరూపాలే. ఇక్కడి శైవులకు గణపతి — పరశురాముడు సమానులే. నేడు పవిత్ర కైలాసంలో శివాజ్ఞ పాటిస్తూ, కైలాసద్వారం వద్ద కావలి ఉన్న గణపతిపై భార్గవుడు పరశువును ప్రయోగించి దంతాన్ని భగ్నం చేయడం చూసావు గదా! ఇప్పుడు మన కర్తవ్యం నిర్వచించు.

ఇలా శివునితో పలికి పార్వతీమాత భార్గవరాముని కేసి తిరిగి అతనితో ఇలా అన్నది — రామా! నీవు బ్రహ్మవంశంలో పుట్టిన పండితుడివి. జమదగ్ని పుత్రుడివి. అన్నింటికీ మించి యోగేశ్వరుడైన శంకరునికి శిష్యుడివి. నీ తల్లి రేణుక లక్ష్మ్యంశతో జన్మించిన దేవతామూర్తి. నీ మాతృవంశం, పితృవంశం కూడా సాధుసరళ వంశములే. నీ గురువు శంకరుడు కరుణాస్వరూపుడు. భక్తవశంకరుడు. నీకు ఈ క్రోధం ఎలా వచ్చింది?

శ్లో॥ గురవే దక్షిణా దానముచితం చ శ్రుతౌ శ్రుతమ్
భగ్నో దంతః తత్సుతస్య భింది మస్తకమప్యహో ॥

(బ్ర.వై.పు.తృతీయ ఖండం.అ.44.శ్లో.23)

గురువునకు దక్షిణ ఇవ్వడం ధర్మమని వేదాలు చెపుతున్నాయి. నీవు గురుదక్షిణంగా నీ గురుపుత్రుని దంతం విరగగొట్టావు. ఇంకేం? అతని శిరస్సును కూడా నఱికివేయి. గణపతిని జయించి కూడా నీవు మా ముందు నిలబడగలిగావంటే అది ఆదిదంపతుల ఆశీర్వచమని గ్రహించు. శివుని అనుగ్రహం పొందిన వాడు ఎటువంటి పని అయినా చేయగలడు.

శ్లో॥ హంతుం శక్తః సృగాలశ్చ సింహం, శార్దూలమాఖుభుక్ ॥ (బ్ర.వై.పు.తృతీయ ఖండం.అ.44.శ్లో.25)

.. ఇంకా ఉంది

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# శ్రీ వేంకటేశ్వర రహస్యము

## బ్రహ్మోత్సవాలు

శ్లో॥ పృథివ్యాం యాని తీర్థాని, బ్రహ్మాండాంతర్గతానిచ
తాని సర్వాణి వర్తంతే వేంకటాహ్వయ భూధరే ॥
(స్కాం.పు.వేం.మా.అ.17.శ్లో.2)

ఈ భూమండలంలోనూ, బ్రహ్మాండాలలోనూ, ఎన్ని తీర్థస్థలాలున్నాయో, అవన్నీ వేంకటశైలంపై ఉన్నాయి. వేంకటాచలం సకల బ్రహ్మాండ స్వరూపం.

ఈ పర్వతం పుణ్యాలకు నిలయం. పాపాత్ములీ క్షేత్రంలో నివసిస్తే ఏదో ఒకనాడు ఆ పాపాల వల్ల ఈ లోకంలోనూ తీవ్ర యాతనలు అనుభవిస్తారు. శరీరం విడచిపెట్టిన తరవాత యమ లోకంలో కింకరుల చేతిలో చావుదెబ్బలు తింటారు. ఇది గ్రహించి వేంకటాద్రిపై పాపాలు చేయకుండా ఉండాలి. శ్రీనివాసుడు, పురుషోత్తముడు నిత్యం నివసించే కొండ ఇది.

శ్లో॥ తస్మిన్నగోత్తమే పుణ్యే వసంతం పురుషోత్తమమ్
శంఖ చక్రధరం దేవం పీతాంబర ధరం శుభమ్
కౌస్తుభాలంకృతోరస్కం భక్తానామభయప్రదమ్
దేవదేవం విశాలాక్షం వేదవేద్యం సనాతనమ్ ॥
(స్కాం.పు.వేం.మా.అ.17.శ్లో.3,4)

శ్రీమహావిష్ణువు, దేవదేవుడు, శ్రీ వేంకటాచలంపై శంఖచక్రధరుడై కొలువున్నాడు. పీతాంబరం ధరించి(పసుపు పచ్చని వస్త్రం), కౌస్తుభమణిని వక్షః స్థలంపై అలంకరించుకొని అభయం ప్రసాదించే దేవదేవుడు విశాలనేత్రుడు. వేదవేద్యుడు. సనాతనుడు. భక్తులకు పిలచిన వెంటనే పలికే దైవం. ప్రతి వర్షం అంగకోసల కర్ణాటక, కాశీ ఘూర్జర చోళ కేరళ పాండ్యాది సర్వదేశాల జనులూ, సకుంటుంబ సపరివార సమేతులై స్వామివారిని సేవించడానికి వస్తుంటారు. దేవతలు, ఋషులు, సిద్ధులు, యోగులు, సనకాది బ్రహ్మ పుత్రులు స్వామి సేవకు వేంచేసి, దర్శించుకొని సంతృప్తులై వెడుతుంటారు.

భాద్రపదమాసంలో వేంకటేశ్వరునికి ఉత్సవాలు నిర్వహించబడతాయి. ఆ సమయంలో స్వామివారి సేవ చేసుకొన్న వారందరూ పాపవిముక్తులై ఉత్తమోత్తములయి తరిస్తారు. కన్యామాసంలో(సౌరమానం ప్రకారం) మొట్ట మొదటిసారి బ్రహ్మదేవుడు శ్రీవేంకటేశ్వరునికి ధ్వజారోప మహోత్సవం దగ్గఱ ఉండి జరిపించాడు. అక్కడ నుండి బ్రహ్మోత్సవాల సంప్రదాయం ప్రారంభమయ్యింది. ప్రతి సంవత్సరం అసంఖ్యాక భక్తులు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు.

....ఇంకా ఉంది



ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# పురాణం లో మహిళలు

## దేవహూతి



దేవహూతి తనకు ఇప్పటివరకు కుమార్తెలు మాత్రమే జన్మించారని, ఆమెకు కూడా ఒక కుమారుడు కావాలని ప్రార్థిస్తుంది. కర్దమ మహర్షి, విష్ణువు మాటలను గుర్తుచేసుకుంటూ, తన భార్య కోరికను తీర్చాలని కోరుకుంటాడు. మరియు అతను కొంతకాలం ప్రాపంచిక జీవితంలో ఉండటానికి అంగీకరిస్తాడు. కొంత కాలం తర్వాత, విష్ణువు స్వయంగా కపిల అవతారంలో అతని కుమారుడిగా జన్మిస్తాడు. ఒక కొడుకు పుట్టిన తర్వాత, కర్దముడు సన్యాసిగా మారి తపస్సు చేయడానికి వెళ్తాడు. వెళ్ళే ముందు, అతను తన భార్య దేవహూతికి విష్ణువు స్వయంగా తమ కొడుకు కపిల రూపంలో కనిపించాడని చెబుతాడు.  అతడు నీ(దేవహూతి) సందేహాలన్నింటినీ తొలగించి రక్షిస్తాడు. ఒకరోజు దేవహూతి తన కుమారుడు కపిలుని దగ్గరికి వెళ్లి, "మహాత్మా! మానవుల అజ్ఞానాన్ని తొలగించి, వారికి జ్ఞానోదయం కలిగించడానికి నువ్వు పుట్టావని నాకు తెలుసు. ఇంద్రియాల ప్రభావంతో జీవితాంతం అజ్ఞానంలో మునిగిపోయిన నాలాంటి వారికి మోహం వదిలించుకునే మార్గాన్ని నాకు చూపించు" అని అంటుంది. అప్పుడు కపిలుడు తల్లి దేవహూతికి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని వివరిస్తాడు. అన్ని బంధాలకు మనస్సే మూలకారణం. ఆత్మ శరీరం కంటే భిన్నమైనదని తెలుసుకోవడం ముఖ్యం. మనసును అదుపులో ఉంచుకుని, సర్వస్వాన్ని భగవంతునికి అర్పించే భక్తి మార్గం మోక్షాన్ని పొందడానికి ఉత్తమ మార్గం. సాధువులు ఎల్లప్పుడూ దేవుడిని స్మరిస్తూ ఉంటారు, అందుకే మంచి సహవాసం ఉంచుకోవడం ముఖ్యం. తల్లి మరింత అడిగినప్పుడు, కపిల దేవహూతికి భక్తి యోగం, తత్త్వజ్ఞానం, సృష్టి రహస్యం, చట్టం, ప్రకృతి మరియు మనిషి యొక్క లక్షణాలు, ఆత్మస్వరూపం, జీవిలో ఆత్మ-సాక్షాత్కారం, ప్రకృతి మరియు మనిషి వేరు, కాలం గమనం, శరీరాల సృష్టి ప్రక్రియ, జీవి పుట్టుక, జీవి యొక్క వివిధ స్థితులు, మరణం మరియు మోక్షాన్ని పొందే మార్గం గురించి ప్రతిదీ వివరంగా వివరించాడు. చివరికి కపిలుడు దేవహూతితో "అమ్మా! నేను నీకు బోధించిన సత్యం ఒక పరమ రహస్యం. దానిని యోగులకు మాత్రమే బోధించాలి. దుష్టులకు, అనైతిక పనులు చేసేవారికి, భక్తి లేనివారికి, భార్య, కొడుకు, సంపద పట్ల ద్వేషం ఉన్నవారికి లేదా దేవుడిని ద్వేషించేవారికి చెప్పకూడదు. అలాంటి వారికి చెప్పడం అరణ్యంలో ఏడవడం లాంటిది. ఈ జ్ఞానోదయం విజయవంతం కావాలంటే, స్వీకరించేవాడు స్వచ్ఛంగా ఉండటం కూడా ముఖ్యం. విశ్వాసం, భక్తి, నైతికత, శాంతి, వైరాగ్యం మొదలైన లక్షణాలు ఉన్నవాడు మాత్రమే ఉపదేశానికి అర్హుడు మరియు అతనికి ఇవ్వబడిన బోధనలు విజయవంతమవుతాయి.


....ఇంకా ఉంది

# ఐశ్వర్యయోగం

శ్రీ మహాగణాధిపతయేనమః | శ్రీ మాత్రేనమః | శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము

## 343 క్షేత్రక్షేత్రజ్ఞపాలినీ (ఓం ఐం హ్రీం శ్రీం క్షేత్రక్షేత్రజ్ఞపాలిన్యై నమః)



క్షేత్రమంటే ఏమిటో 341 వ నామంలో వివరించాము. అటువంటి క్షేత్రాలను (క్షేత్రములను ఎఱిగినవారిని క్షేత్రజ్ఞః అంటారు), క్షేత్రజ్ఞులను పాలించునది కనుక అమ్మవారిని క్షేత్రక్షేత్రజ్ఞపాలిని అని పిలుస్తారు. వేదం ప్రధాన క్షేత్రజ్ఞపతిర్గణేశః అంటోంది. ఆ గణపతిని కూడా పాలించునది అని కూడా మరొక అర్థం.

### మంత్రప్రయోగవిధానం – ఫలితం


ఇల్లు కట్టడం ఆరంభించి ఇల్లు పూర్తవ్వక, అప్పులు తట్టుకోలేక బాధపడేవారు 41 రోజులు శ్రీమహాగణేశుని పటం ఎదురుగా పెట్టుకొని, అటుకులు, బెల్లం నివేదించి, ఈ మంత్రాన్ని రోజూ 1008 సార్లు జపిస్తూ కలువలు, తామరపూలు, మందారపూలతో పూజిస్తే అప్పులు తీరి ఇల్లు కట్టుకోవడం పూర్తి చేసుకొని సుఖపడగలుగుతారు. ఇల్లు అద్దెకు ఇవ్వాలనుకొన్నా, ఎవ్వరూ అందులోకి దిగకపోతే ఈ మంత్రాన్ని ఆ ఇంటిలో ఒకరోజు 1008 సార్లు జపించండి. మంచివ్యక్తులు అద్దెకు దిగుతారు. నిత్యం 11 సార్లు ఈ మంత్రాన్ని పారాయణ చేస్తే పనులలో విఘ్నాలు ఉండవు.

... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో

## ఋషి చరిత్ర

# కణ్వుడు

భారతీయ సంస్కృతి వేదాలనే పునాదులపై నిర్మితమై ఉంది. వేదాలు నిత్య సత్యాలనీ, మానవజాతి మనుగడకు ప్రతి అడుగులోనూ మార్గదర్శనం చేస్తూ నిస్వార్థ బుద్ధితో, త్యాగమయమైన ప్రవృత్తితో తమ జీవితాలను గడిపిన మహానుభావులెందరో మన వేదవాఙ్మయంలో కనిపిస్తారని చెప్పబడింది. ఆ మహానుభావులలో కణ్వమహర్షి ఒకరు. కణ్వమహర్షి గొప్ప గురువు, ఋషి. ఆయన జీవితం, బోధనలు భారతీయ సంస్కృతిలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. కణ్వుడు అంగీరసుని వంశంలో ఘోరుడు అనే ఋషికి జన్మించాడు. కణ్వుడు మహానిష్ఠాగరిష్ఠుడు. గొప్ప తపస్సంపన్నుడు. తన తపస్సు నిరాటంకంగా సాగేందుకు అతను మాలిని అనే నదీ తీరంలో ఒక ఆశ్రమాన్ని నిర్మించుకున్నాడు.వేదాలలో కణ్వమహర్షికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఋగ్వేదంలోని కొన్ని శ్లోకాలను కణ్వ మహర్షే రచించారని చెబుతారు. ఆయన వేదమంత్రాలను దర్శించి వాటిని లోకానికి అందించిన గొప్ప ఋషులలో ఒకరిగా కీర్తింపబడ్డారు. కణ్వమహర్షి పేరు మీదుగా కణ్వ శాఖ కూడా ఉంది. ఇది ఆయన వేద విజ్ఞానానికిచ్చిన ప్రాధాన్యతను తెలియజేస్తుంది. వేద సాహిత్యంలో ఆయన స్థానం గురు పరంపరలో ఒక వెలుగు దివ్వెలాంటిది. కణ్వమహర్షి రచనలు వైదిక సాహిత్యంలో ఒక ముఖ్యమైన స్థానాన్ని ఆక్రమించాయి. వీటికి తోడుగా ‘కణ్వస్మృతి’ పేరుతో ఈయన రచించిన ధర్మశాస్త్రానికి కూడా గొప్ప ప్రాముఖ్యత ఉంది. కణ్వుని ‘మునికులచూడామణి’ అంటారు, అంటే మునులలో గొప్పవాడు అని అర్థం. కణ్వమహర్షి గురించి వేదాలలో అనేక కథలు ప్రస్తావించబడ్డాయి.



ఆయన గొప్ప తపస్వి, జ్ఞాని అని ప్రతీతి. కణ్వమహర్షి ఆశ్రమం ఒక విద్యా కేంద్రంగా విలసిల్లింది. ఎందరో శిష్యులు అక్కడ విద్యాభ్యాసం చేసారు. ఆయన బోధనలు ధర్మం, న్యాయం, మానవతా విలువలు మొదలైన వాటిపై ఆధారపడి ఉండేవి. కణ్వమహర్షి జీవితం ఒక దివ్యగాథ. ఆయన నిస్వార్థ సేవ, త్యాగం, జ్ఞాన తృష్ణ మనకు ఆదర్శం.

...ఇంకా ఉంది

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# కాశీ కథలు

## దివోదాసుని వృత్తాంతం

శివాజ్ఞతో మూషిక వాహనుడై మందరాచలమునుండి కాశీకి వినాయకుడు చేరుకున్నాడు.కాశీలో వినాయకుడు ఒక బ్రాహ్మణ జ్యోతిష్కుడి రూపమును ధరించాడు.తన మాయా ప్రభావంతో కాశీపుర వాసులకు రాత్రి నిద్రలో దుఃస్వప్నములను కలుగజేసాడు,ఉదయం వారి ఇంటికి వెళ్లి మీకు గ్రహచారం సరిగా లేదని మీ పరిస్థితి ఆశాజనకంగా లేదని వారిని భయపెట్టేవాడు.తర్వాత కొన్ని ప్రాయశ్చిత్తములు ఉన్నాయని చెప్పి వారి చేత పూజలు చేయించి వారిని మాయాప్రభావంతో



రక్షించేవాడు. నగరసంచారం చేస్తూ దుశ్శకునములు,భూకంపములు వంటి ఉత్పాతములను కలిగించి వాటి వలన ఏర్పడు సమస్యలను తెలియజేసి,కొందరు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి కాశీనుండి బయటికి వెళ్లేలా చేసాడు.తన మాయా ప్రభావం చేత అంతఃపురములో ప్రవేశించినాడు.మహారాణుల యొక్క మన్ననలను పొంది వారికి విశ్వాసపాత్రుడు అయ్యాడు. గతంలో రాణుల జీవితంలో జరిగిన విషయములను వారికి తెలియజేసి,భవిష్యత్తు గురించి వారితో చెబుతూ వారి మన్ననలను పొందాడు. రాణీవాసపు స్త్రీలు అందరూ వృద్ధ బ్రాహ్మణుడి రూపంలో ఉన్న విఘ్నేశ్వరుడిని మితభాషి అని, అసత్యమును ఆడని వాడని, ఉదారుడు అని,అసూయ లేనివాడని, వేద ధర్మములు ఎరిగినవాడని జ్యోతిశ్శాస్త్ర పండితుడని,నిర్మలమైన మనసు కలిగిన వాడని,కపటము లేనివాడని అనేక రకములుగా పొగుడుతూ ఉండేవారు.లీలావతి అను పేరు ఉన్న రాణి ఈ వృద్ధ బ్రాహ్మణుడి గుణగణములను ఆయన శక్తినీ తపస్సునూ పొగుడుతూ దివోదాసుకు వివరించింది.రాజు ఆజ్ఞను తీసుకొని తన సహాయకుల ద్వారా బ్రాహ్మణ వేషంలో ఉన్న గణపతిని రాజు సమీపమునకు పంపించింది.రాజు ఎంతో సంతోషించి అనేకమైన ఉపచారములు చేసి సత్కరించాడు.తర్వాత విప్రరూపంలో ఉన్న గణపతి వేద మంత్రములు చదువుతూ రాజుని ఆశీర్వదించాడు. రాజు తన ఆసనము పై బ్రాహ్మణ రూపంలో ఉన్న గణపతిని కూర్చోబెట్టి అనేకమైన విషయములపై సంభాషించారు.తరువాత బ్రాహ్మణ రూపంలో ఉన్న గణపతి తిరిగి తన స్థానమునకు వెళ్లి పోయారు.దివోదాసు లీలావతితో ఓ దేవి! ఈ విప్రుడు నీవు చెప్పిన దాని కన్ననూ అత్యంత ఉత్తమ గుణములను కలిగిన మహానుభావుడు.భవిష్యత్తు గురించే కాక గడచిన విషయములపై కూడా సంపూర్ణ అవగాహన కలిగి ఉన్నాడు. భవిష్యత్తు గురించి ఈ బ్రహ్మకు పూర్తిగా తెలుసు, అందువల్ల నేను ఇతడిని కొన్ని విషయములు అడిగి తెలుసుకుంటాను అని పలికెను. మరునాడు ఆ వృద్ధ బ్రాహ్మణుడిని సగౌరవముగా పిలిపించి పట్టువస్త్రములను,బంగారు నాణెములను సమర్పించి ఏకాంతములో ముచ్చటించెను.ఓ బ్రాహ్మణోత్తమా మీరు వేదపండితులు సర్వమూ తెలిసినవారు, మహా జ్ఞానము కలిగిన వారు నేను అడిగిన విషయములను యధార్థముగా తెలుపుడు అని దివోదాసు ప్రార్థించెను .

..ఇంకాఉంది

# స్తోత్రమాలిక

## శ్రీ సీతారామకల్యాణ ఘట్టం

ఫలశ్రుతి:

నవగ్రహ అనుగ్రహానికి, సకలకార్యసిద్ధికి నిత్యం లేదా శనివారం ఈ 9 శ్లోకాలు పారాయణం చేయడం మంచిది. గర్భిణీ స్త్రీలు ఈ శ్లోకాలని విన్నా చదివినా వారికి సత్సంతానం కలుగుతుంది.

మాణిక్యము(సూర్యగ్రహము )

తతోరావణనీతాయాః సీతాయాః శత్రుకర్శనః | ఇయేష పదమన్వేష్టుం చారణాచరితే పథి ||1||

ముత్యము(చంద్రగ్రహము)

యస్య త్వేతాని చత్వారి వానరేంద్ర యథాతవ | స్మృతిర్మతిర్ధృతిర్దాక్ష్యం స కర్మసు న సీదతి ||2||

ప్రవాళము(కుజగ్రహము)

అనిర్వేదః శ్రియో మూలం అనిర్వేదః పరం సుఖం | అనిర్వేదో హి సతతం సర్వార్థేషు ప్రవర్తకః ||3||

మరకతము (బుధగ్రహము)

నమోస్తు రామాయ సలక్ష్మణాయ దేవ్యై చ తస్యై జనకాత్మజాయై |

నమోస్తు రుద్రేంద్రయమానిలేభ్యో నమోస్తు చంద్రార్క మరుద్గణేభ్యః ||4||

పుష్యరాగము (గురుగ్రహము)

ప్రియాన్న సంభవేద్దుఃఖమ్ అప్రియాదధికం భయమ్ |

తాభ్యాం హి యే వియుజ్యంతే నమస్తేషాం మహాత్మనామ్ ||5||

### హీరకము (శుక్రగ్రహము)

రామః కమలపత్రాక్షః సర్వసత్త్వమనోహరః | రూపదాక్షిణ్యసంపన్నః ప్రసూతోజనకాత్మజే || 6 ||

### ఇంద్రనీలము(శనిగ్రహము)

జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః | రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితఃదాసోహం
కోసలేంద్రస్య రామస్యాక్లిష్ట కర్మణః హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః || ౭ ||

### గోమేదకము/గోమేధికము (రాహుగ్రహము)

యద్యస్తి పతి శుశ్రూషా యద్యస్తి చరితం తపః | యది వాస్త్యేకపత్నీత్వం శీతో భవ హనూమతః || 8 ||

### వైడూర్యము (కేతుగ్రహము)

నివృత్తవనవాసం తం త్వయా సార్ధమరిందమం |

అభిషిక్తమయోధ్యాయాం క్షిప్రం ద్రక్ష్యసి రాఘవం || ౯ ||

||ఇతి శ్రీ ఆంజనేయ నవరత్నమాలాస్తోత్రమ్ సంపూర్ణం ||



# గురుదేవుల జీవన కవనము

## నవవింశతిః అధ్యాయః




అమ్మ విగ్రహ ప్రతిష్ఠ చేయమన్నా కూడా ఆసక్తి చూపించలేకపోయారు.మనసులో ₹3000 జీతంతో ఉద్యోగం చేస్తున్న నాకు ఈ విగ్రహ ప్రతిష్ఠ తలకు మించిన భారము తల్లీ అని అమ్మవారికి సమాధానం ఇచ్చారు. రెండువేల సంవత్సరంలో ఉజ్జయిని మహాకాళి ఆలయాన్ని పూజ్య గురుదేవులు సందర్శించినప్పుడు అమ్మవారు గురువుగారిని తన విగ్రహప్రతిష్ఠ చేసి పూజించమని స్వప్న సందేశం అందించింది.అయినా కూడా గురువు గారు విగ్రహ ప్రతిష్ఠకు ఆలోచించలేకపోయారు,కారణం ఇంతటి మహత్తరమైన కార్యమును చేయగల శక్తి అమ్మ ప్రసాదించినప్పుడే ప్రారంభిస్తాను అని సంకల్పం చేసారు కానీ ప్రారంభం చేయలేదు.2004 వ సంవత్సరములో మళ్లీ నైమిశారణ్య యాత్రకు భక్తులతో కలసి వెళ్లారు.ఈ సారి యాత్రలో గొప్ప సంఘటనలు జరిగాయి.అమ్మవారు మళ్లీ మళ్ళీ విగ్రహ ప్రతిష్ఠ చేయమని సందేశం ఇచ్చారు. ఈ సారి గురుదేవులతో యాత్రకు వచ్చిన భక్తులు అందరూ కూడా గురుదేవులను పీఠం స్థాపించమని గురువుగారిని పదే పదే వేడుకున్నారు.యాత్ర లో ఇలా జరుగగా. ఉద్యోగం చేస్తున్న కళాశాలలో గురువు గారు యాత్ర కోసం పెట్టుకున్న సెలవు చీటీ ప్రిన్సిపాలు గారికి చేరలేదు అందువల్ల యాత్ర ముగించి కళాశాలకు వచ్చిన పద్మాకర్ గారిని సమాధానము చెప్పమని యాజమాన్యం కోరింది.విధి నిర్వహణ లో జరిగిన పొరపాటుకు గురువుగారు రాజీనామా చేసారు

.. ఇంకా ఉంది